


ఆధ్యాత్మికం.. ఆహ్లాదం.. వినోదం..



- పర్యాటకంగా మేడారం అభివృద్ధికి ప్రణాళిక
- జాతరప్పుడే అందుబాటులో గిరిజన మ్యూజియం, ఓపెన్ థియేటర్, ట్రైబల్ విలేజ్ సెట్టింగ్
- స్మృతివనం ఏర్పాటుతో పెరగనున్న సందర్శకులు
- జాతీయ పండుగ హోదా, నిధులకోసం మంత్రి సీతక్క ప్రయత్నాలు

ప్రకృతి దేవతలు సమ్మక్క, సారలమ్మలు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం అభయారణ్యంలో కొలువైన తల్లుల దర్శనం భక్తులకు అనిర్వచనీయ అనుభూతి. రెండేళ్లకో సారి మహాజాతర, ఏడాదికోసారి మినీ జాతర జరుగుతుండగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. కొన్నేళ్లుగా సాధారణ రోజుల్లో కూడా తల్లులను దర్శించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మేడారం పరిసరాలు, అటవీ ప్రాంతంలో విడిదిచేసి ఆహ్లాదంగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో వనదేవతల సన్నిధిని ఆధ్యాత్మికంగాను, పర్యాటకంగానూ అభివృ ద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ పండుగ హోదాను సాధించడంతోపాటు మేడారం ఖ్యాతిని నలుచెరుగులా చాటిచెప్పేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 25 ఎకరాలలో సమ్మక్క సారలమ్మలతోపాటు వనదేవతలకు సంబంధించిన విశేషాలతో స్మృతివనం నిర్మించనుంది.

- ములుగు

5

త్యాగాల పండుగ బక్రీద్

5



- నేడు జరుపుకోనున్న ముస్లింలు
- ముస్తాబైన మసీదులు, ఈద్గాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేక ప్రార్థనలు



ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ముస్లింలందరూ ఈ పండుగను జరుపుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ జుహా (బక్రీద్). దీనినే త్యాగాల పండుగ అనికూడా పిలుచుకుంటారు. ఈదుల్ ఫితర్ తరువాత రెండు నెలలకు ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల (జుల్ హుజ్జా) 10వ రోజున బక్రీద్ పండుగను జరుపుకుంటారు. దైవాజ్ఞకు లోబడి ఆ అల్లాహ్‌కు విశ్వాసంగా ప్రతీ ముస్లిం పరోప కార బుద్ధితో, శాంతియుత జీవనం గడుపుతూ ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలనే సందేశాన్ని ఈ పండుగ తెలియజేస్తుంది. సోమవారం బక్రీద్‌ను నిర్వహించుకునేందుకు ముస్లింలు సంసిద్ధమయ్యారు. ప్రార్థనలు చేసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు.

- మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/జఫర్‌గఢ్



బడి బస్సు భద్రమేనా?

- వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ దృష్టి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లాలో 127 పాఠశాలలు.. 100 బస్సులు
- నామమాత్రపు తనిఖీలతో సర్టిఫికెట్లు జారీ
- విద్యార్థుల భద్రతను పట్టించుకోని అధికారులు



మానుకోటలోని ఆర్టీవో కార్యాలయం వద్ద ఫిట్‌నెస్ కోసం తీసుకువచ్చిన ప్రైవేటు పాఠశాలల బస్సులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 16 : జిల్లా వ్యాప్తంగా ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికి ప్రైవేటు పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ప్రతి సంవత్సరం నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలు పూర్తికావాల్సి ఉండగా, ఇప్పటికీ 20 శాతం బస్సులకు పూర్తికాలేదని తెలుస్తోంది. సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే నామమాత్రంగా తనిఖీలు చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చి చేతులు దులుపుకోవడం పట్ల విద్యార్థుల భద్రతను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావిడి చేస్తున్న ట్రాన్స్‌పోర్టు అధికారులు తర్వాత వాటి ఊసెత్తడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత విద్యా సంవత్సరం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాల బస్సు బయ్యారం వైపు విద్యార్థులను తీసుకువెళ్తున్న క్రమంలో గాంధీపురం సమీపంలో అదుపుతప్పి రోడ్డు దిగింది. కానీ, బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగలేదు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఓ పాఠశాల బస్సు దంతాలపల్లి మండలం బొడ్లాడ పరిధిలో బోల్తా పడింది. అందులో 60 మంది విద్యార్థులుండగా ఐదుగురికి స్వల్పగాయాలు కావడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లాలో 127 పాఠశాలలు.. 100 బస్సులు..

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 127 ప్రైవేటు పాఠశాలలున్నాయి. వాటిల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 37,739 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సుమారు 100కు పైగా బస్సుల్లో జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండల కేంద్రాలు, గ్రామాల నుంచి పాఠశాలలకు విద్యార్థులను తీసుకువస్తున్నారు. ఒక విద్యార్థికి కనీసం నెలకు రూ.700 నుంచి రూ.1500 వరకు వ్యాను ఫీజు యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. బస్సుల ద్వారా ఆదాయాన్ని పెంచుకుంటున్న యాజమాన్యాలు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాటించాల్సిన నిబంధనలు..

విద్యార్థులను బస్సుల ద్వారా పాఠశాలలకు తీసుకువెళ్లే యాజమాన్యాలు తప్పనిసరిగా ఈ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. సంబంధిత వెబ్‌సైట్‌లో పాఠశాల వివరాలు మొత్తం నమోదు చేయాలి. పాఠశాల అడ్రస్, సెల్ నంబర్, స్కూల్ బస్సు నంబర్, డ్రైవర్ వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జీ, ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లతో పాటు విహన వివరాలు పొందుపర్చాలి. బస్సులో ఉండే అటెండర్ పేరు, వయస్సు, బస్సులో ప్రయాణించే విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను నమోదు చేయాలి. డ్రైవర్, అటెండెంట్‌గా పనిచేసే వారు 18 సంవత్సరాలకు తక్కువ కాకుండా ఉండాలి. ఆ వ్యక్తుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. నిబంధనల ప్రకారం అన్నీ పరిశీలించి ధ్రువపత్రాన్ని పాఠశాల యాజమాన్యాలకు అందజేస్తారు.

స్కూల్ బస్సు ఫిట్‌గా...

బస్సు ఎక్కే మెట్లు(ఫుట్‌బోర్డు) భూమి నుంచి 325 మిల్లీ మీటర్లకు మించి ఉండకూడదు. ఫుట్ బోర్డు వద్ద పిల్లలు బస్సు ఎక్కిదిగేందుకు ఇబ్బంది పడకుండా రెయిలింగ్ పవర్ స్టీరింగ్ ఉండి ఫ్రీ ప్లే చాలా తక్కువగా ఉండాలి. డ్యాష్ ప్యానల్ బోర్డులో ఎడమ, కుడి ఇండికేటర్ ఉండాలి. ఎయిర్‌ప్రెజర్ గేజ్, ఫెయిల్స్ సేఫ్టీ ఇండికేటర్, బ్రేకుల్లో లోపాలు తెలిపే ఇండికేటర్, ఫ్యూయల్ మీటరు, స్పీడో మీటరు, డ్రైవర్ సీటు వద్ద ఎయిర్ హ్యాండ్ బ్రేక్, హ్యాండ్ లివర్ గైడ్ స్ప్రింగ్, గేర్ లివర్‌లో అంతర్గత స్ప్రింగ్, కాన్వెక్స్ క్రాస్‌వ్యూ మిర్రర్లు, బస్సులో పిల్లల కదలికలు తెలుసుకునేందుకు డ్రైవర్ వద్ద అద్దం, అగ్నిమాపక సిలిండర్ (పొడి), తలుపులకు సురక్షిత లాకింగ్ సిస్టమ్, సీట్ల కింద విద్యార్థులకు లగేజీ బాక్సులు, పార్కింగ్, సిగ్నల్ లైట్లు పనిచేస్తూ ఉండాలి. బస్సుకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పిల్లలు సరక్షితంగా బయటకు వచ్చేందుకు అత్యవసర ద్వారం ఏర్పాటు చేయడంతో పాటు ద్వారం వద్ద అద్దం కూడా ఉంచాలి.

డ్రైవర్ అర్హతలు.. ఆరోగ్య పరీక్షలు..

18 సీట్ల లోపు సామర్థ్యం ఉన్న స్కూల్ వ్యాన్, ఆర్డినరీ బస్సు నడిపే డ్రైవరుకు ఎల్ఎంటీ ట్రాన్స్‌పోర్టు లైసెన్స్, బ్యాడ్జి ఉండాలి. 20 సీట్లు దాటిన బస్సులను నడపడానికి హెచ్‌టీవీ లైసెన్స్ బ్యాడ్జి ఉండాలి. వాహనాల సీట్ల సామర్థ్యాన్ని బట్టి డ్రైవర్‌ను నియమించాలి. బాధ్యతారహితంగా ఉండే వ్యక్తులను డ్రైవర్లు, అటెండెంట్లుగా నియమించరాదు. డ్రైవర్ లైసెన్స్ వివరాలు రవాణా శాఖ వెబ్‌సైట్‌లో ఉండాలి. డ్రైవర్, అటెండెంట్ ఆరోగ్యంగా ఉండాలి. డ్రైవర్ 18-60 ఏళ్ల మధ్యలో ఉండాలి. డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్యపరీక్షలు బీపీ, గుండె, మధుమేహం, కంటి పరీక్షలు చేయించాలి. బస్సులో డ్రైవర్ లైసెన్స్, బస్సు నంబరు, ఇంజన్ నంబరు, ఛాయిస్ నంబరు కలిగిన కాగితానికి ఫ్రేం కట్టించి డ్రైవర్‌కు కుడివైపున ఉంచాలి. కరస్పాండెంట్/ప్రిన్సిపాల్/హెచ్ఎం, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్లు, పిల్లల వివరాలతో కూడిన జాబితా, ఎక్కడెక్కడ దిగుతున్నారనే వివరాలు అందుబాటులో ఉంచాలి.



80 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి

ఎమ్డీ.గౌస్‌పాషా, జిల్లా రవాణా శాఖాధికారి

మహబూబాబాద్ జిల్లా పరిధిలో ప్రైవేటు పాఠశాలల బస్సులు సుమారు వంద వరకు ఉన్నాయి. వాటిల్లో 80 వరకు ఫిట్‌నెస్ కోసం కార్యాలయానికి రాగా పరీక్షించి సర్టిఫికెట్లు ఇచ్చాం. బస్సుల ఫిట్‌నెస్‌తో పాటు అర్హులైన డ్రైవర్లు, అటెండెంట్‌లను మాత్రమే నియమించుకోవాలని అన్ని పాఠశాలల యాజమాన్యాలకు సూచిస్తున్నాం. ప్రభుత్వ నిబంధలకు వ్యతిరేకంగా బస్సులను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.





ప్రైవేట్ క్లినిక్‌లో తనిఖీ నిర్వహిస్తున్న వైద్య టాస్క్‌ఫోర్స్ టీం, తనిఖీ టీం పట్టుకున్న మీరోపేనేమ్ ఇంజక్షన్

వైద్య టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీలు

- మరిపెడలోని పలు ప్రైవేట్ క్లినిక్‌ల్లో సోదాలు

మరిపెడ, జూన్ 16 : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని పలు ప్రైవేట్ క్లినిక్‌లలో ఆదివారం రాత్రి రాష్ట్ర వైద్య మండలి ఆదేశానుసారం టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక మెడికల్ ప్రాక్టిషనర్ పేరుతో వీవీ స్వామి ఎలాంటి అర్హతలు లేకున్నా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఐసీయూలోని ఎమర్జెన్సీ రోగులకు వాడే మీరోపేనేమ్ ఇంజక్షన్లు పేషెంట్లకు ఇస్తున్నట్లు తనిఖీ బృందం గుర్తించింది. ఎన్ఎంసీ చట్టం 34, 54 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఆక్లినిక్‌ను సీజ్ చేసినట్లు తనిఖీ అధికారులు డాక్టర్ నరేశ్, కొలిపాక వెంకటస్వామి విలేకరులకు వెల్లడించారు. అదేవిధంగా డాక్టర్లుగా చలామణి అవుతున్న మరిపెడలోని కొందరు నకిలీ వైద్యులను గుర్తించి హెచ్చరించారు. వారి క్లినిక్‌లోని బెడ్స్, ఐవీ స్టాండ్స్, ఆపరేషన్ పర్నిచర్ సిబ్బందితో తొలగించారు.

నేడు మరిపెడకు మంత్రి సీతక్క రాక

మరిపెడ, జూన్ 16 : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం మరిపెడ మండలంలో పర్యటించనున్నారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7న హైదరాబాద్ మియాపూర్ నడిగడ్డతండా దగ్గర మరిపెడ మండలం ఎల్లంపేట రెవెన్యూ పరిధి లక్మాతండాకు చెందిన బాలిక అత్యాచారం, హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని కలుస్తారని తెలిపారు. అనంతరం డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, కాంగ్రెస్ నేతలతో మరిపెడ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో సమీక్షించనున్నారు.

మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న మరమ్మతులు



పగుళ్లు తేలిన 20వ పిల్లరు వద్ద కొనసాగుతున్న ప్లాస్టింగ్ పనులు

మహదేవపూర్ రూరల్, జూన్ 16 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. బ్లాక్-7లో ఉన్న 11 గేట్లకు 10 గేట్ల ఎత్తివేత ఇప్పటికే పూర్తికాగా కుంగుబాటు ప్రభావం అధికంగా ఉన్న 20వ నంబరు గేటు తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. బ్యారేజీ కిందున్న అగాధాన్ని పూడ్చేందుకు చేపట్టిన గ్రౌటింగ్ పనులతోపాటు షీట్‌ఫైల్స్ అమరిక, సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. బ్లాక్-7లోని 20 పిల్లరుతోపాటు గేట్ల బే ప్రాంతంలో తేలిన పగుళ్లను ఇసుక, సిమెంటు మిశ్రమాలతో ప్లాస్టింగ్ చేస్తున్నారు. గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక, సీసీ బ్లాకుల పనులు చివరి దశకు చేరుకున్న క్రమంలో పగుళ్లను మూసేసి ప్లాస్టింగ్ చేసే ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది.

ప్రజా సంక్షేమమే సర్కార్ లక్ష్యం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూన్ 16 : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. వారి అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలు తయారుచేసి ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో రైతులకు అనేక సమస్యలు వచ్చాయని, కాస్తులో ఒకరు ఉంటే.. పట్టాలు ఇంకొకరి పేరు మీద ఉన్నాయని, అందులో తాను కూడా బాధితుడినేనని అన్నారు. ధరణి కమిటీతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చర్చలు జరిపారని, త్వరలోనే రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఆర్టీసీని నిర్వీర్యం చేయాలని బీఆర్ఎస్ సర్కార్ చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దాని బలోపేతానికి కృషి చేస్తుందని వివరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి పేద మహిళకు త్వరలోనే నెలకు రూ.2500 అందుతాయని, ఆ దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా ఆగస్టు 15లోపు ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడం ఖాయమన్నారు. అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు అందుతాయని, తనను ఆశీర్వదించి గెలిపించిన ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ మిట్టకంటి రాంరెడ్డి, కౌన్సిలర్లు పోతురాజు రాజు, భూక్య శ్రీను, కోడి శ్రీను, రవినాయక్, రాజు, మాదరబోయిన యాకయ్య, సిరిపురం వీరన్న, చలమల నారాయణ, శంతన్ రామరాజు, బండి వెంకన్న, రాంచంద్రు, గణేష్, సల్వాది దిలీప్, యాకూబ్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

నేడు విద్యుత్ ప్రజావాణి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 16: వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించ నున్నట్లు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో, సెక్షన్ ఆఫీస్‌లలో, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుం దన్నారు. విద్యుత్ ప్రజావాణిని పటిష్టపరచడంలో భాగంగా సమీక్షలు నిర్వహించి వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోబడుతాయన్నారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు న్నా ప్రజావాణిలో ఫిర్యాదు చేయొచ్చని ఆయన పేర్కొన్నారు.

బాలిక మృతిపై సీబీఐ విచారణ జరిపించాలి

- గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు కిషన్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, జూన్ 16 : హైదరాబాద్ మియాపూర్‌లో గిరిజన బాలిక మృతిపై సీబీఐచే విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజన బాలిక మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ ఘటనపై పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడం విచారకరమన్నారు. పొట్ట చేతపట్టుకుని మరిపెడ మండలం నుంచి మియాపూర్‌కు వెళ్లి జీవిస్తున్న నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన బాలిక వారం రోజుల తర్వాత శవంగా మారడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర రాజధానిలో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. దోషులను వెంటనే శిక్షించి గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దుడ్డెల రామ్మూర్తి, నాజర్, పోలెపాక వెంకన్న, గుంజె హన్మంతు, మహంకాళి వీరన్న, కొత్త శ్రీనివాస్, ప్రభాకర్, అంబరీష, పూర్ణ, బిచ్యానాయక్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

సజావుగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 16 : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జిల్లాలో జరిగిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష సజావుగా సాగినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు కల్పించిన వసతులపై సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ పరీక్షకు 4,730 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఉదయం నిర్వహించిన పరీక్షకు 2,637 (55.75 శాతం) మంది అభ్యర్థులు హాజరు కాగా, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 2,614 (55.26 శాతం) మంది అభ్యర్థులు హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు.

తనిఖీ చేసిన అబ్జర్వర్

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను యూపీఎస్సీ అబ్జర్వర్ హరిహర్ రథ్ టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల, సీడీసీ డీమ్డ్ యూనివర్సిటీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పింగిళి ప్రభుత్వ జూనియర్ కళాశాల, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, న్యూసైన్స్ డిగ్రీ, పీజీ కళాశాల, మాస్టర్జీ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ నేషనల్ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అబ్జర్వర్ హరిహర్ రథ్



హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల గేటు ముందు అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసులు



పీడీఎస్ రైస్ పట్టివేత

రూ.4లక్షల 42వేల సరుకు స్వాధీనం


పోలీసులు పట్టుకున్న బియ్యం

వరంగల్ క్రైం, జూన్ 16: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రూ.4లక్షల 42వేల విలువ కలిగిన 17 టన్నుల పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన ఎం.జంపయ్య, ఎం.రాజశేఖర్ ఇద్దరు పరిసర గ్రామాల్లో పీడీఎస్ రైస్ సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరిద్దరు సేకరించిన బియ్యం గ్రామ పరిసర ప్రాంతంలో ఒక ఇంట్లో పెట్టారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రైస్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం చిల్పూర్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ దయాకర్ ధ్రువీకరించారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 16: హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో రాయితీ కోసం నిర్వహిస్తున్న స్కాలర్‌షిప్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సంస్థ డైరెక్టర్ రాముయాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 విద్యా సంవత్సరానికి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించి మెరిట్ ఆధారంగా కోర్సుల ఫీజుల్లో రాయితీని కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 23న స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరా లకు 9030610033, 9849167839 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 16: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్‌కు చెందిన రొండి శివకుమార్ (21) ఈ నెల 3న రాత్రి కాజీపేట డీజిల్ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గాయాలపాలైన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అక్క రాజకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడు కూలీపని చేసుకుంటూ జీవిస్తుంటాడు. వివాహం కాలేదు. ఇతడికి ఒక సోదరి ఉంది.















అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

» విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
» అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
» 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్‌ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్‌ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

\- ఎం.ప్రేమ్‌కుమార్,
వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో' మొబిలిటీకి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

» టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

» 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

» వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

త్యాగాల పండుగ బక్రీద్

● నేడు జరుపుకోనున్న ముస్లింలు ● ముస్తాబైన మసీదులు ● ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేక ప్రార్థనలు

'ఉన్నదొక్కటే... అది.. మానవ జాతి.. పంచాల్సింది ఒక్కటే... నిరంతర ప్రేమ.. ఎవరిపై ఎవరికీ ఎలాంటి ఆధిక్యతలు లేవు.. ఒకరి ధన, మాన, ప్రాణాలు మరొకరికి నిషిద్ధం.. ఒకరి హక్కును మరొకరు దోచుకోవడం శిక్షార్హం.. పగ, ప్రతీకారం, వడ్డీ, లావాదేవీలన్నీ రద్దయ్యాయి..'
... 1500 యేళ్ల కిందట మహ్మద్ ప్రవక్త చివరి హజ్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలివీ.. ఆయన ప్రసంగం ఆద్యంతం మానవ హక్కులకు పెద్దపీట వేసింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో సామాజిక ప్రగతిని ఉత్తమ జీవిత ప్రమాణాలను ఉద్బోధించారు. హజ్ వంటి ఆధ్యాత్మిక యాత్రలో సంప్రదాయాలు, ధార్మిక కట్టుబాట్ల గురించి కాకుండా మానవ హక్కుల గురించి మాట్లాడడం ప్రపంచ మానవ హక్కుల ప్రకటనగా భావించవచ్చు.



ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

మహబూబాబాద్, (ఆంధ్రజ్యోతి)/జఫర్‌గడ్, జూన్ 16: త్యాగబోధన పండుగైన బక్రీద్.. సకల మానవ లోకానికి సౌభ్రాతృత్వాన్ని, జాతి, మత, బీద, గొప్ప భేదాలను మాన్పి ప్రేమానురాగాలతో సంబంధాలను మరింత పెంపొందించేందుకు సందేశాన్ని ఇస్తుందని ప్రతీతి. ముస్లింలు ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 9గంటల లోపు వివిధ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితుల కనుగుణంగా నిర్దేశిత సమయానికి సామూహిక పండుగ ప్రార్థనల ఈద్‌గాహ్ మైదానాలకు చేరుకుంటారు. అక్కడ భేదాభావం లేకుండా అందరూ సహపంక్తిలో నిలబడి ప్రార్థనలు నిర్వహింప చేసే పెద్ద ఇమామ్‌ను అనుసరిస్తూ ఖుద్బా నమాజ్‌లో పాల్గొంటారు.

ఖుర్బానీతో అల్లాహ్‌పై విశ్వాసం

ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు త్వరగానే పూర్తి చేసుకున్న ముస్లింలు.. తమ గృహాలకు చేరుకుని ఖుర్బానీ ద్వారా అల్లాహ్‌పై విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ జంతు బలిదానాలు చేస్తారు. జంతు బలిదానం మాంసాన్ని మూడింట ఒక వంతు పేదలకు పంపిణీ చేయాలి. మిగిలిన రెండు భాగాల్లో ఓ భాగం తన సొంతానికి, మరో భాగం పొరుగు వారు, బంధుమిత్రులకు పంపి ణీ చేస్తారు. ఖుర్బానీ మాంసాన్ని ముస్లిమేతరులకు కూడా పంపిణీ చేయవచ్చని తద్వారా మానవులంతా ఒక్కటేనన్న భావన కలిగించినట్లవుతుందని ముస్లిం పెద్దలు చెబుతారు.

ఖుర్బానీ వెనుక పరీక్ష..

ఖుర్బానీ అంటే జంతుబలిదానం అని చెబుతారు. అన్ని ప్రేమల కన్నా దైవ ప్రేమ గొప్పదని, దీనికోసం అన్నింటినీ త్యాగం చేయాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడని ముస్లిం పెద్దలు చెబుతారు. ఆ ఆజ్ఞ తొలిసారిగా పరీక్షకు నిలిచిన సందర్భంగా ఖుర్బానీ తెరపైకి వచ్చిందని పేర్కొంటారు. దీన్ని ఉదహరించి విశ్లేషించే కథనాన్ని ఊటంకిస్తూ ఏటేటా బక్రీద్ ఈద్-ఉల్-జుహ జంతు బలిదానాలతో నిర్వహించుకుంటూ వస్తున్నారు.

ఖుర్బాని కథాకమామీషు వెనుక..

హజ్రత్ ఇబ్రహీంకు లేకలేక ఒక కొడుకు హజ్రత్ ఇస్మాయిల్ జన్మిస్తాడు. ఒక రోజు హజ్రత్ ఇబ్రహీం, తన కొడుకును జిబాహ్(వధ) చేస్తున్నట్లు కలగంటాడు. ఆ కల తనకు దైవాజ్ఞగా భావించి కల సారాంశాన్ని తన కొడుకు ఇస్మాయిల్‌కు చెబుతాడు. అదే అల్లాహ్ ఆజ్ఞ అయినప్పుడు తాను సిద్ధమేనని ఇస్మాయిల్ అంటాడు. హజ్రత్ ఇబ్రాహీం అల్లాహ్ ఆజ్ఞగా భావించి పుత్ర వాత్సల్యాన్ని జయించి కన్న కొడుకు ఇస్మాయిల్ మెడ మీద కత్తి తిప్పడానికి సిద్ధమవుతాడు. ఆ సమయంలోనే అల్లాహ్ ఇబ్రహీంలోని ప్రేమబలిని గుర్తించడంతో అక్కడ కొడుకు స్థానం లో గొర్రెపోతు ప్రత్యక్షమై జిబాహ్(బలి) అవుతుంది. ఇలా అల్లాహ్ పరీక్షలో ఇబ్రహీం నెగ్గుతారు. ఆ క్రమంలోనే ఖుర్బాని తెరపైకి వచ్చిందని ముస్లింలు విశ్వసిస్తారు.

బక్రీద్‌తోనే ఖుర్బానీ..

మనిషిలో ఈ త్యాగ భావాన్ని సజీవంగా, సచేతనంగా ఉంచడానికి యేటా బక్రీద్ పండుగ నాడు ముస్లింలు ఖుర్బానీ ఇస్తారు. అల్లాహ్ ఆదేశాల ఆంతర్యం ఇదేనని కోట్లాది మంది ముస్లిం ప్రజలు ఈ పండుగ రోజున జంతుబలిదానం చేస్తారు. త్యాగభావానికి తార్కాణమైన బక్రీద్ పండుగ మతసామరస్యానికి ఎంతో దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఖుర్బానీ, ఆధ్యాత్మిక, సామాజిక, కుటుంబ బాధ్యతలు, త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్ర(హజ్)ల ప్రాధాన్యతల గురించి ఈద్గా(సామూహిక ప్రార్థనా స్థలం)లపై ముస్లిం పెద్దలైన ఇమామ్‌లు ఉపన్యాసాలు చేస్తారు.

ఆధ్యాత్మిక యాత్ర హజ్..

త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్రను హజ్ అంటారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని సౌదీఅరేబియా దేశంలోని మక్కాలో ఉండే కాబా గృహాన్ని దర్శించే సంకల్పంతో లక్షలాది ముస్లింలు హజ్ యాత్రను చేస్తారు. ప్రపంచం నలుమూలల నుంచి ముస్లింలు మక్కా నగరానికి తరలివెళ్తారు. దైవప్రవక్తకు పూర్తిగా విధేయులై వారు జారీ చేసిన ప్రతీ ఆదేశాన్ని ఎటువంటి సంకోచం లేకుండా శిరసా వహించేలా హజ్ శిక్షణ ఇస్తుందని ముస్లింలు విశ్వసిస్తారు. ఇస్లామియా జీవన వ్యవస్థకు మూలస్తంభాలైన నమాజ్(ప్రార్థన), రోజా(ఉపవాసం), జకాత్(దానం)లతో పాటు హజ్ కూడా తప్పనిసరి అని ముస్లింలకు దైవాదేశం. అందువల్లే జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ముస్లింలు లక్ష్యంగా ఎంచుకుంటారు.

మౌలిక సూత్రాలు

ఇస్లాం ధర్మంలోని ఐదు మౌలిక సూత్రాలను యావత్ ప్రపంచ ముస్లింలు విధిగా పాటిస్తారు. మొదటిది సృష్టికర్త ఒక్కడేనన్న విశ్వాసం. రెండోది దైవ ప్రార్థన నమాజ్. మూడోది ఉపవాసం(రోజా), నాలుగోది జకాత్(ఆర్థిక విధానం). ఐదోది హజ్(కాబా సందర్శన యాత్ర). ఇందులో ఏ ఒక్కదాన్ని విస్మరించినా విశ్వాసం పరిపూర్ణం కాదని నమ్ముతారు. మానవుడు దైవ విశ్వాసి అనడానికి రుజువులు ఇవేనని చెబుతారు. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతీ ముస్లింపై హజ్ విధిగా నిర్ణయించబడింది. స్థోమత కలిగిన వారు జీవిత కాలంలో ఒక్కసారైనా ఈ యాత్ర చేయడం తప్పనిసరి. ఈ ఆరాధన జిల్‌హజ్ మాసంలో సౌదీ అరేబియాలోని పవిత్రమైన మక్కా నగరంలో జరుగుతుంది. ఆ రోజే (ఈ నెల 17న) ప్రపంచంలోని ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. దీన్నే 'ఈద్-ఉల్-జుహ' అని, 'బక్రీద్' అని, 'ఈదెఖుర్బాన్' అని రకరకాలుగా వ్యవహరిస్తారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం.. వినోదం

● పర్యాటకంగా మేడారం అభివృద్ధికి ప్రణాళిక ● స్మృతివనం ఏర్పాటుతో పెరగనున్న సందర్శకులు



మేడారంలో ఆదివాసీల కళాప్రాంగణం



మేడారంలోని గిరిజన మ్యూజియం

ములుగు, జూన్ 16: మేడారం పరిధిలోని రెడ్డిగూడెం వద్ద జంపన్నవాగును ఆనుకొని ఉన్న 25ఎకరాల స్థలాన్ని స్మృతివనం కోసం ఎంపిక చేశారు. 2024మహాజాతర ఏర్పాట్ల సమయంలోనే రాష్ట్ర మంత్రి సీతక్క అధికారులకు చేసిన సూచనలతో స్మృతివనానికి శ్రీకారం చుట్టారు. స్థల పరిరక్షణ కోసం ప్రహరీగోడ నిర్మాణాన్ని మొదలు పెట్టారు. అయితే జాతర తర్వాత పనులు ముందుకు సాగలేదు. జాతరకు వచ్చే భక్తులు ఎక్కువగా విడిదిచేసే ప్రదేశాలలో జంపన్నవాగు, రెడ్డిగూడెం పరిసరాలు ప్రధానమైనవి. గద్దెలకు కేవలం కిలోమీటర్ దూరంలోనే ఉండటం, పుణ్యస్నానాల అనంతరం ఈ మార్గం గుండానే వనదేవతల దర్శనానికి వెళ్తుండటంతో స్మృతివనం భక్తులను పూర్తిస్థాయిలో అలరించనుంది. రాష్ట్ర పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులు డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రూపొందిస్తున్న నేపథ్యంలో వచ్చే జాతర నాటికి స్మృతివనం భక్తులకు అందుబాటులోకి వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

- ఆకట్టుకుంటున్న చిలుకలగుట్ట కుడ్య చిత్రాలు

సమ్మక్క తల్లి కుంకుమ బరిణె రూపంలో కొలువైన మేడారంలో అత్యంత విశిష్టత కలిగిన చిలుకలగుట్ట ఇప్పుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రహరీగోడ పై గతంలో రంగులతో వేసిన చిత్రాల స్థానంలో కుడ్య చిత్రాలను రూపొందించడం జరిగింది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, సమ్మక్క, సారలమ్మల చిత్రాలను అందంగా తీర్చిదిద్దారు. గుట్ట పరిరక్షణ చర్యలను మరింత విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. సుమారు 800ఎకరాలలో విస్తరించి ఉన్న చిలుకలగుట్టను 2018లో అప్పటి రాష్ట్రప్రభుత్వం ముగ్గురు పూజారుల పేరిట ఐటీడీఏ ద్వారా ఆర్ఓఎఫ్ఆర్ పట్టా చేసింది.

- గిరిజన మ్యూజియం, ఓపెన్ థియేటర్

గద్దెలకు సమీపంలో నిర్మించిన గిరిజన మ్యూజియం, హంపి ఓపెన్ థియేటర్ జాతర భక్తులను పూర్తిస్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాయి. మ్యూజియం నిర్వహణలో లోపాలున్నాయి. ఆదివాసీ సంస్కృతి, జీవన విధానాలను ప్రతిబింబించేలా వస్తువులను ఇక్కడ అందుబాటులో ఉంచారు. అయితే జాతర సమయంలో మాత్రమే భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నారు. సాధారణ రోజుల్లో మ్యూజియానికి వచ్చేవారి సంఖ్య తక్కువే. అక్కడ మ్యూజియం ఉందనే విషయం ఎక్కువ మందికి తెలియకపోవడం గమనార్హం. పక్కనే ఉన్న ఆదివాసీ కళాప్రాంగణం ఓపెన్ థియేటర్‌లో జాతర జరిగే నాలుగైదు రోజుల్లో మాత్రమే ఆదివాసీ కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. థింసా, గుస్సాడి, కొమ్ము నృత్యాలు, వనదేవతల ప్రాశస్త్యాన్ని, చరిత్ర ను చాటుతూ ప్రదర్శించే నాటికలను తిలకించే ందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. మ్యూజియం ప్రాంగణంలో తాత్కాలికంగా రూపొం దించే ట్రైబల్ విలేజ్ సెట్టింగ్ కూడా ఆకట్టుకుం టుంది. గడ్డి గుడిసెలు, ఎడ్లబండ్లు, ఆదివాసీలు ఉపయోగించే సంప్రదాయ పనిముట్లు తదితర వస్తువులను ప్రదర్శనకు ఉంచుతారు. అయితే జాతర అనంతరం కూడా ఇవన్నీ అందుబాటులోకి వస్తే భక్తులు, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రధానంగా సెలవు రోజులు, వీకెండ్‌లలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్మృతివనం నిర్మాణంతో భక్తుల ఆకాంక్ష కొంతమేరకు నెరవేరుతుంది.

- శాశ్వత నిర్మాణాలపై ముందుకు..

2018జాతర సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం గద్దెల విస్తరణ, సదుపాయల కల్పనకోసం భారీ ప్రకటన చేశారు. రూ.200కోట్ల నిధులతో 200ఎకరాలలో మేడారాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కానీ, ఆచరణ సాధ్యం కాలేదు. అయితే అప్పటి అధికార యంత్రాంగం సమర్పించిన డీపీఆర్ భద్రంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా 2024మహాజాతర ఏర్పాట్లకు ఆటంకం ఏర్పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడటం, సమయం తక్కువగా ఉండడంతో శాశ్వత నిర్మాణాలను వాయిదావేసి తాత్కాలిక ప్రాతిపదికన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారు.

ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలకోడ్ కూడా ముగియడంతో జాతర అభివృద్ధి, శాశ్వత నిర్మాణాలపై దృష్టిసారించారు. గత జాతరకు ముందు జిల్లా యంత్రాంగం సమర్పించిన నివేదికతో పాటు సవరించిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. మళ్లీ 2026లో మహాజాతర జరుగుతుండగా ఈలోగానే యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అధికారు లు అందుకు సమాయత్తమవుతున్నారు.

- స్మృతివనం ప్రతిపాదన హర్షనీయం

కొక్కెర రమేష్, సమ్మక్క పూజారి



మేడారంలో వనదేవతలకు స్మృతి వనం నిర్మించడం హర్షించతగిన విషయం. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మలకు రూపం లేదు. పులి, జింకలు వారి వాహనాలని భక్తులు నమ్ముతుంటారు. భక్తుల నమ్మకాన్ని నిరూపించేలా వారి చరిత్ర, స్మృతులను తెలిపే విధంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. స్మృతివనం ఏర్పాటుతో జాతరకు మరింత వైభవం రానుంది.

తల్లుల చరిత్ర ఆసక్తికరంగా ఉంటుంది

వల్లపు స్వామి, గజ్వేల్



సమ్మక్క, సారలమ్మ చరిత్ర ఆసక్తిక రంగా ఉంటుంది. వారి గురించిన మరిన్ని విశేషా లతో స్మృతివనం ఏర్పాటు చేస్తే తల్లుల గురించి తెలుసు కునేందుకు నాలాంటి భక్తులు ఎంతోమంది వస్తారు. నేను మేడారానికి రావడం ఇదే ప్రథమం. సంతానం కలగాలని దేవతలను ముడుపు కడితే మాకు పాప పుట్టింది. మొక్కు తీర్చుకునేందుకు ఇక్కడికి వచ్చాం.

హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి

దనసరి సీతక్క రాష్ట్రమంత్రి



మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా సాధనకోసం రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉంది. కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే క్రమంలో త్వరలో మంత్రుల బృందంతో కేంద్రం వద్దకు వెళ్తాం. ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. మేడారం సమగ్రాభివృద్ధికోసం వనదేవతల భక్తురాలిగా, మంత్రిగా కృషిచేస్తా.

ఎంపీ కావ్యను కలిసిన ఎమ్మార్పీఎస్ దండోరా నేతలు



వరంగల్‌లో ఎంపీ కడియం కావ్యతో ఎమ్మార్పీఎస్ దండోరా నాయకులు

నెక్రొంసెంటర్, జూన్ 16 : వరంగల్‌లో ఎంపీ కడియం కావ్యను మానుకోట ఎమ్మార్పీఎస్ దండోరా నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ్ర ఎల్లయ్య మాట్లాడుతూ వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో ఎవరెన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం న్యాయమే గెలిచిందన్నారు. ఎంపీ కావ్య చొరవ తీసుకుని పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ సమస్యపై మాట్లాడాలని కోరారు. వివిధ పార్టీల పెద్దలను ఒప్పించి ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దైద భద్రయ్య, పులి శ్రీను, సీహెచ్.రాధ, కుక్కల సుధ, మల్లెపాక ఐలయ్య, గుళ్ల సమ్మయ్య, గుళ్ల పద్మ పాల్గొన్నారు.

మెడికల్ షాపు నిర్వాహకుడికి ఆర్థిక సాయం



కేసముద్రంలో మెడికల్ షాపు నిర్వాహకునికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కేసముద్రం, జూన్ 16 : కేసముద్రం స్టేషన్‌లో ఇటీవల అగ్నిప్రమాదంలో నష్టపోయిన యజమాని నరేష్‌కు మండల మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.49వేలు, జిల్లాలోని మెడికల్ షాపుల ద్వారా రూ.32వేలు వెరసి రూ.81వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం రాత్రి కేసముద్రంలో అందించారు. అగ్నిప్రమాదంలో షాపు పూర్తిగా దగ్ధమై నరేష్ సుమారు రూ.15లక్షలు నష్టపోయాడని అన్నారు. ఇప్పటికే నరేష్ ఆర్థిక సమస్యలతో బాధపడుతుండగా అగ్నిప్రమాదం రూపంలో మరింత నష్టం వాటిల్లిందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం ఆయన్ను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు వోలం సత్యనారాయణ, బుచ్చిలింగం, శ్రీనివాస్, హసీం అలీ, వేణు, సతీష్, అనిల్, ఏకాంతం, రాజు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు ఈద్గా మైదానాలు ముస్తాబు

▸▸ వర్షం కురిస్తే మసీదులలోనే ప్రత్యేక నమాజ్‌లు

మహబూబాబాద్ టౌన్, జూన్ 16 : ముస్లింల పవిత్రమైన బక్రీద్ ఈద్-ఉల్-జుహ పండుగ సామూహిక ప్రార్థనల కోసం మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈద్గా మైదానాలు ముస్తాబయ్యాయి. మునిసిపాలిటీల పరిధిలో ఈద్గా మైదానాల్లో విద్యుత్ సరఫరా, ఇతరత్రా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌లు ఆదేశించారు. శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఈద్గా నమాజ్‌లకు ముస్లిం పెద్దలు ప్రత్యేక సమయాలను నిర్ణయించి ప్రకటించారు.

- పాతబజారులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సమీపాన గల ఈద్గా మైదానంలో ఉదయం 7 గంటలకు ఈద్-ఉల్-జుహ నమాజ్ నిర్వహిస్తారు.
- కొత్తబజారులోని నూతన ఈద్గా మైదానంలో ఉదయం 7.30 గంటలకు ఈద్-ఉల్-జుహ నమాజ్ నిర్వహిస్తారు.
- పై రెండు ఈద్గా మైదానాలకు చేరుకోలేక పోయిన వారి కోసం పట్టణ నడిబొడ్డున తహసీల్దార్ ఆఫీస్ సమీపాన గల జామియా మస్జీద్ మహబూబీయాలో ఉదయం 8 గంటలకు ఈద్-ఉల్-జుహ నమాజ్ నిర్వహిస్తారు.
- ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే ఈద్గా నమాజ్‌లు ఆయా ప్రాంతాల్లోని మస్జీద్‌ల్లోనే నిర్వహించుకోవాలనిముస్లింపెద్దలు నిర్ణయించారు.



మహబూబాబాద్‌లోని జీజేసీ వద్ద ఈద్గా మైదానం

మసీదు, ఈద్గాల వద్ద పోలీసు బందోబస్తు

మహబూబాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని మసీద్‌లు, ఈద్గాల వద్ద పోలీసులు భారీ బందోస్తు ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ప్రార్థనలు చేసుకునే మసీద్, ఈద్గాల వద్ద ఎంలాటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లోని అన్ని మసీద్, ఈద్గాల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కల్నల్ సంతోష్‌బాబుకు ఘన నివాళి



బీసీకాలనీలో కల్నల్ సంతోష్ బాబుకు నివాళులర్పిస్తున్న కాలనీ వాసులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 16 : మహబూబాబాద్ లోని శ్రీరాంనగర్ బీసీ కాలనీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కల్నల్ సంతోష్‌బాబుకు నివాళులర్పించారు. నాలుగేళ్ల కిందట దేశ ఉత్తర సరిహద్దుల్లో చైనాతో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో ప్రాణాలు కోల్పోయిన కల్నల్ సంతోబాబు చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు మాట్లాడుతూ చైనా సరిహద్దు లడక్ ప్రాంతంలోని గల్వాన్ లోయలో పహారా కాస్తున్న భారతదేశ సైనికుల మీద హఠాత్తుగా చైనా దాడి చేసి ఆటవిక ప్రవృత్తిని చాటుకుందన్నారు. ఈ ఘటనలో 20 మంది దేశ సైనికులు చనిపోగా అందులో తెలుగువాడు కల్నల్ సంతోష్ ఉన్నారని గుర్తుచేశారు. దేశంలో ప్రతి ఒక్కరు సైనికుల త్యాగాలను గుర్తు చేసుకోవాలన్నారు. కల్నల్ సంతోష్ ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మగాని అరుణ్‌కుమార్, చొప్పరి శ్రీనివాస్, రామరాజు సాగర్, బాణాల వీరయ్య పాల్గొన్నారు.

జ్ఞానవంతులుగా జీవితాన్ని కొనసాగించాలి



వక్తలను సన్మానించిన సమ్మేళన సభ్యులు

తొర్రూరు, జూన్ 16 : రాజ్యాంగాన్ని అనుసరిస్తూ అపనమ్మకాలకు దూరంగా ఉంటూ జ్ఞానవంతులుగా జీవన విధానాన్ని కొనసాగించాలని మహా జ్ఞాన సమ్మేళనం ఆర్గనైజింగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథ్ గోవిహంస అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు జ్ఞానం పొందిన ఏకైక వ్యక్తి అని, అతనిని అనుసరించే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి పేద బలహీన, బడుగు వర్గాలకు మేలు చేయాలనే ఆలోచనతో రాజ్యాంగ పీఠికను తయారు చేశారని, దానికి అనుగుణంగా ప్రజలు వాస్తవ జీవితాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం వక్తలను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్‌లు డాక్టర్ వంశీ, డాక్టర్ తిరుపతి, జి.రామకృష్ణ, నగేష్, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, జగన్నాథం, రాంమ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం నిర్మాణానికి రూ.51,116 విరాళం



విరాళం అందజేసిన రామారావు-శేషకుమారి

గార్ల, జూన్ 16 : మండలంలోని మర్రిగూడెం సమీపంలో గల వేట వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఇటీవల ఈదురుగాలులకు నేలమట్టమైన ధ్వజస్తంభం పునర్నిర్మాణానికి ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన కందగట్ల రామారావు-శేషకుమారి దంపతులు ఆదివారం శాంతిపూజలు నిర్వహించి రూ.51,116 విరాళం అందించారు. మండలంలోని దాతలు ముందుకు వచ్చి ధ్వజ స్తంభం నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

విశ్రాంతి ప్రాంగణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



కాచికల్‌లో విశ్రాంతి ప్రాంగణాన్ని పారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు, జూన్ 16 : మండలంలోని కాచికల్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విశ్రాంత ప్రాంగణాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్ డాక్టర్ కుందూరు గీతారాజేందర్‌రెడ్డి వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంతి ప్రాంగణాన్ని నిర్మించారన్నారు. గ్రామస్థులకు, ప్రయాణికులకు విశ్రాంతి ప్రాంగణం ఉపయోగపడుతుందన్నారు. గ్రామాల్లో లయన్స్ క్లబ్ సేవలు అభినందించదగ్గ విషయమన్నారు. క్యాక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శారద, లక్ష్మీనర్సింహరావు, డాక్టర్ రామనర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, ఇట్టె దేవేందర్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, గుగులోత్ బాలాజీనాయక్, విజయపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

బాలికను హత్య చేసిన దోషులను శిక్షించాలి

మరిపెడ రూరల్, జూన్ 16 : హైదరాబాద్‌లోని మియాపూర్ శివారు ఏటిగడ్డ తండాలో నివాసం ఉంటున్న మరిపెడ మండలం ఎల్లంపేట రెవెన్యూ పరిధిలోని లక్ష్మాతండాకు చెందిన బాలిక బానోతు వసంత(12)ను అత్యాచారం, హత్య చేసిన హంతకులను వెంటనే శిక్షించాలని లంబాడా హక్కుల పోరాట సమితి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాందాస్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం లక్ష్మాతండాలో మృతురాలి తల్లిదండ్రులను పరామర్శించి మాట్లాడారు. వసంత చాక్లెట్ కోసం కిరాణ దుకాణానికి వెళ్లిందని, అక్కడే మాటువేసిన దుండగులు వసంతను ఎత్తుకెళ్లారన్నారు. తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్తే పసిపాపను కొందరు దుండగులు అత్యాచారం చేసి, హత్య చేశారని తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారని అన్నారు. హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, వసంత కుటుంబానికి ప్రభుత్వం రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మంగీలాల్, శివవర్మనాయక్ పాల్గొన్నారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

▸▸ డీఈ పెరుమాళ్లపెల్లి విజయ్



మహబూబాబాద్ రూరల్, జూన్ 16 : టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచన మేరకు మహబూబాబాద్ డివిజన్ పరిధిలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ ప్రజావాణిని నిర్వహిస్తున్నట్లు డీఈ పెరుమాళ్లపెల్లి విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ మహబూబాబాద్ డివిజన్ 13 సెక్షన్ల పరిధిలోని కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ డివిజన్, మహబూబాబాద్ టౌన్-1, టౌన్-2, మహబూబాబాద్ రూరల్, సబ్ డివిజన్, ఈఆర్వో, కేసముద్రం, ఇనుగుర్తి, కేసముద్రం సబ్‌డివిజన్, గూడూరు, అయోధ్యపురం, కొత్తగూడ, గంగారం, గూడూరు సబ్ డివిజన్, గూడూరు సబ్ ఈఆర్వో, కురవి, సీరోలు, డోర్నకల్, గార్ల, కొత్తపేట, కురవి సబ్‌డివిజన్, కురవి ఈఆర్వో కార్యాలయాల్లో ప్రజావాణి జరుగుతుందని చెప్పారు. ఆయా ఆఫీసుల్లో వినియోగదారులు సంప్రదించాలని కోరారు.

- తొర్రూరు : ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం విద్యుత్ సమస్యలపై ప్రజావాణి నిర్వహించనున్నట్లు విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో గల విద్యుత్ ఏఈ, డీఈ, ఏడీ, ఈఆర్‌వో అకౌంట్స్ పరిధిలో వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని, వినియోగదారులు కార్యాలయంలో సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

▸▸ ఎస్ఎస్ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వీరన్న



మహబూబాబాద్‌లో దాసు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న నేతలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 16: సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని ఎస్ఎస్ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని అంబేద్కర్ సెంటర్‌లో ఎస్ఎస్ఏ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల మరణించిన సీఆర్పీ దాసు చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా 15 సంవత్సరాలుగా విద్యాశాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని నమ్మబలికి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని కోరారు. అదేవిధంగా చనిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంపాల నారాయణ, కొత్త శ్రీను, ప్రభాకర్, అమరేష్, సతీష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

కేసముద్రం, జూన్ 16 : కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ 2003-04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక వీసీబీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు తమ మధురానుభూతులను నెమరు వేసుకున్నారు. అప్పుడు బోధించిన ఉపాధ్యాయులైన స్వరాజ్‌బాబు, వంగ దుర్గాప్రసాద్, ఉప్పలవీరయ్య, శ్రీనివాసాచారి, రామానుజాచారి, వెంకటయ్య, రాజవీరు, సాయిలు, నమ్మాళ్‌వార్, లక్ష్మారెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నజీరోద్దీన్, రిజ్వానాలను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆబ్యాచ్ విద్యార్థులు ఎండీ.రజాక్, చేతి సంతోష్, ఎండీ.రహమాన్, కొండ శ్రీను, రాజు, మిర్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- కొత్తగూడ : కొత్తగూడ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 18 సంవత్సరాల తర్వాత శ్రీగుంజేడు ముసలమ్మ జాతరలో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. స్నేహితులతో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. విందు, వినోదాలు నిర్వహించుకున్నారు.
- దంతాలపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005-06 పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. చిన్న నాటి గుర్తులను జ్ఞప్తికి తెచ్చుకుని దంతాలపల్లి బడి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, జి.జుంకిలాల్, సోమయ్య, రాంచంద్రమూర్తి, రెహమాన్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.
- తొర్రూరు : తొర్రూరు పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1985-86 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్ననాటి మిత్రులందరూ ఒకేచోట చేరి అలనాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో డాక్టర్లు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర వృత్తుల్లో ఉన్న వారు ఆప్యాయంగా పలకరించుకుని తోటి వారితో అనుబంధాలను పంచుకున్నారు. గతించిన తమ స్నేహబంధం చిరకాలం అభిలషించాలని ఆకాంక్షించారు. వివిధ కారణాలతో మృతి చెందిన మిత్రులకు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఆనాటి ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెరుమాండ్ల రవి, వెంకన్న, దయాకర్ రెడ్డి, సోమశేఖర్, కృష్ణారావు, రాంమోహన్ రెడ్డి, ఇమ్మడి రాము, గీతారాణి, వనజ, నిర్మల, సుమారు 100 మంది పాల్గొన్నారు.



కేసముద్రం స్టేషన్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



గుంజేడు జాతరలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



దంతాలపల్లిలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



తొర్రూరు పట్టణంలో ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు

నాన్నకు ప్రేమతో..

తండ్రికి మొక్కను బహుకరించిన పిల్లలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 16 : మహబూబాబాద్ పట్టణంలో ఆదివారం ఫాదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఫాదర్స్ డేను పురస్కరించుకుని తండ్రిచే కేక్ కట్ చేయించడంతోపాటు వారికి పిల్లలు బహుమానాలు అందించారు. అందులో భాగంగానే మహబూబాబాద్ పట్టణ శివారు ఇందిరనగర్ కాలనీలో ఫాదర్స్ డేను పురస్కరించుకుని హరితమిత్ర అవార్డు గ్రహీత, ప్రకృతి ప్రేమికుడు దైద వెంకన్న-స్రవంతి దంపతులకు నాన్నకు.. ప్రేమతో అంటూ వారి పిల్లలు మొక్కను బహుకరించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో హర్షిత్, హర్షిత, హర్షిక పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

డోర్నకల్, జూన్ 16 : గుడుంబాను తయారు చేసి విక్రయించేందుకు వెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి 6 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. ఆదివారం ఉదయం డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు, సిబ్బందితో కలిసి మండలంలోని మల్లాయికుంటతండా సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అదే తండాకు చెందిన తిరుపతి అనే వ్యక్తి క్యాన్‌తో వెళ్తున్నాడు. అనుమానం వచ్చి క్యాన్‌ను తనిఖీ చేయగా గుడుంబాగా నిర్ధారించి స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వానలు కురవాలని కప్పతల్లి ఆట

కొత్తగూడ, జూన్ 16 : వానలు కురవాలని, పంటలు పండాలని కోరుతూ మండలంలోని కొత్తపల్లిలో గ్రామస్తులు కప్ప తల్లి ఆట ఆడించారు. చిన్నారులు కావడి మోస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వారిపై నీళ్లపోస్తూ వానలు కురవాలని వేడుకున్నారు.

నలుగురు నకిలీ నక్సలైట్ల ముఠా అరెస్టు

▸▸ వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ, జూన్ 16: నలుగురు నకిలీ నక్సలైట్ల ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ చందన దీప్తి వివరాలు వెల్లడించారు. గత నెల 28వ తేదీన పీఏపల్లి మండలం ఘనపూర్ గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ తల్లి గుడిని శుభ్రం చేయడానికి వెళ్లిన తోటకూరి పెద్ద వెంకటయ్యకు గుడిలో ఒక మూలకు మూడు తుపాకులు కన్పించాయి. దీంతో ఆయన స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తుపాకులను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కొందరు ఇచ్చిన సాక్ష్యాలను బట్టి ఘనపురం గ్రామానికి చెందిన తోటకూరి శేఖర్ ఈ తుపాకులను దాచాడన్నా అనుమానంతో అతని కోసం గాలింపు చేపట్టారు. అంగడిపేటలో ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించారు. గతంలో అక్రమ తుపాకులు కలిగి ఉండడంతో శేఖర్‌పై హాలియా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై జైలుకు వెళ్లాడు. శేఖర్‌కు మిర్యాలగూడ జైలులో రమేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వారు జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత జీవితంలో తొందరగా స్థిరపడాలన్నా ఉద్దేశంతో రమేష్‌కు పరిచయం ఉన్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ కలిసి సూడో నక్సలైట్లుగా చెలామణి అవుతున్నారు. వీరంతా తుపాకులను ధరించి ధనవంతులను, మైనింగ్ వ్యాపారులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించేవారు. అదేవిధంగా రోడ్డుపై వెళ్లే వాహనదారులను ఆపి తుపాకులను చూపించి బెదిరించి డబ్బులు వసూలు చేసేవారు. విశాఖపట్నం దగ్గరలోని జీకే వీధి సాపర్లలో తుపాకులను కొనుగోలు చేశారు. ఈ తుపాకులను కొన్ని రోజులు శేఖర్ తన ఇంట్లోనే ఉంచుకుని ఎవరైనా చూస్తారన్నా భయంతో ఘనపురం గ్రామ శివారులోని పెద్దమ్మతల్లి గుడిలో భద్రపర్చాడు. తుపాకులు పెద్దగా ఉన్నాయని భావించి పిస్టల్ లాంటి చిన్న తుపాకులు ఉంటే కనపడకుండా పట్టుకెళ్లొచ్చని పిస్టల్ అన్వేషణలో ఉండగా శేఖర్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతను ఇచ్చిన సమాచారంతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మాచర్ల శ్రీనివాస్‌ను, అదే గ్రామానికి చెందిన గుంటుక రమేష్‌ను, అదే జిల్లా కేసముద్రానికి చెందిన మారపాక లక్ష్మీనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం





వేంకటేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, దీపిక దంపతులు

సీరోలు, జూన్ 16 : సీరోలు మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శివపార్వతులు, పద్మావతి, అలివేలు మంగమ్మ శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఉదయం 8.05 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 11.50 గంటలకు శ్రీ పద్మావతి అలువేలు మంగమ్మ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శివపార్వతుల కల్యాణం అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయ వేదపండితులు శరత్, హరీష్, గిరిధరాచారి, శ్రీనివాసశర్మ, కృపాల్‌శర్మ, అభిరామశర్మ, మాధవరావు, అర్చకులు సంతోష్ కల్యాణాలను జరిపించారు. ఆలయ అభివృద్ధి చైర్మన్ వెడవెల్లి హర్షవర్ధన్‌రెడ్డి, దీపిక దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. భక్తులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎమ్మెల్సీ వెడవల్లి వెంకట్‌రెడ్డి, కురవి జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, సీరోలు తహసీల్దార్ శారద, మాజీ సర్పంచ్‌లు రంగమ్మనాగేశ్వర్‌రావు, రామచంద్రునాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు నాగేశ్వర్‌రావు, గురువయ్య పాల్గొన్నారు.